


నిద్ర ముంచుకువస్తోంది రాఘవకు. క్షణం పాటు రెప్పలు మూసుకుపోయి మనస్సు ప్రశాంతతకు చేరుకోబోతున్న సమయానికి ఎవరో తట్టి లేపినట్టుగా ఉలిక్కిపడుతూ కళ్ళు తెరుస్తున్నాడు. అదో అవస్థ. నిద్ర పట్టనూ పట్టదు, ముంచుకు రాకుండానూ ఉండదు. వంట్లో నరాలన్నీ బిగదీసుకు పోయి ఇబ్బంది పెడుతుంటాయి. కంటినిండా కునుకు దీసి అతను ఎన్నాళ్ళయిందో ...

మంచం మీద వెల్లకిలా పడుకుని ఉన్నాడతను. సీలింగు నుంచి వేలాడుతున్న ఫాను మెత్తగా చప్పుడు చేయకుండా తిరుగుతోంది పైన. డిమ్‌గా వెలుగుతున్న బెడ్ లాంపు వెల్తురులో గదంతా మత్తుగా జోగుతున్నట్లుగా కనిపిస్తోంది.

అవతలి మంచం మీద ముగతగా పడి ఉన్న హరి ఉండి ఉండి మూలగటం వినిపిస్తోంది. పిల్లవాడి కాళ్ళవేపున కూర్చుని కునికిపాట్లు పడుతున్న జానకి అతనట్లా మూలిగినప్పుడల్లా ఉలిక్కిపడుతూ కళ్ళు తెరిచి చూస్తోంది కొడుకువేపు ఆందోళనగా.

"బాబూ, హరీ! ఏమిటి నాయనా?"

ఆమె స్వరాన్ని వినిపించుకునే స్థితిలో లేడు పిల్లవాడు.

"నిద్రలో మూలుగుతున్నాడు గాని నువ్వూ కాస్సేపు పండుకో జానకీ!" ఆమెను ఓదార్చటానికని అన్నాడు రాఘవ.

చెంగుతో కళ్ళు తుడుచుకుందామె.

నిస్సహాయంగా నిట్టూర్చాడు రాఘవ.

ఏమి జబ్బులో ఏమి పాడో!! రెండేళ్ళనుంచీ బాధ పడుతున్నాడు పిల్లవాడు హృదయ కవాటాలకు సంబంధించిన వ్యాధిలో. ఎప్పటికప్పుడు డాక్టరు సలహా తీసుకుంటూనే ఉన్నాడు తాను. వైద్యం చేయిస్తూనే ఉన్నాడు. హఠాత్తుగా ఏమైందో తెలియదు, పదిహేను రోజుల క్రితం పరిస్థితి విషమించింది. ఆస్పత్రి చుట్టూ తిరగటాలు, డాక్టర్లు, స్పెషలిస్టులు, ఆదంతా గాభరాన్నీ గందరగోళాన్నీ, ఆర్థికపరమైన ఇరుకుదనాన్నీ సృష్టించిపెట్టాయి.

చేతి వాచీకేసి చూసుకున్నా డతను.

పన్నెండున్నర.

చుట్టూ ఎంత నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దంలోంచి ఎంత ఏకాంతతనం!? అవతల ఉన్న అంత విశాల విశ్వంలో ఎట్లాంటి మనుష్యు లున్నారని?! బంధువులూ, స్నేహితులూ, శ్రేయోభిలాషులూ, ఆత్మీయులూ — అలా నాటకాలు వేసే వాళ్ళూ, నమ్మించ జూసేవాళ్ళూ — ఏరీ, ఒక్కళ్ళుకాకపోతే ఒక్కళ్ళు — ఈ అర్ధరాత్రి సమయాన, ఈ దిక్కుమాలిన స్థితిలో — తనకు ఓదార్పు నివ్వటానికి, తన బాధలో పాలు పంచుకోటానికి— ఒక్కళ్ళూ రారేం? ఇక్కడ తనూ, తన భార్యా—ఈ బాధతో, ఈ దిగులుతో, ఈ మెంటల్ టెన్షన్‌తో ఉక్కిరి బిక్కిరవుతుంటే ... లోకానికేమాత్రమూ పట్టటం లేదు! ఎవరి సుఖాలు వాళ్ళవి, ఎవరి స్వార్థాలు వారివి. ఎంత వికృత లోకం?! ఎంత స్వార్థ పూరిత ప్రపంచం?!

అంతలో మళ్ళీ తన కొడుకు వ్యాధి గుర్తుకొచ్చిం దతనికి. పాపం వాడేం చేశాడని వాడి కా దీర్ఘవ్యాధి రావాలి?! ముప్పై ఏళ్ళ జీవితానికి మించి గారంటీ లేదట. పదహారేళ్ళు ఆ ప్రాంతాల గుండెకు ఆపరేషను చేయాల్సి ఉంటుందట. లోకంలో ఇంత మంది కుర్రవాళ్ళుండగా వాడికే ఎందుకు రావాలా వ్యాధి?

"డబ్బులు దొరికాయండీ?"

జానకి ప్రశ్నతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాడు రాఘవ.

"డబ్బులా ... డబ్బులు ..."

దొరికా యన్నట్లుగా తలూపాడు.

"ఎవరిచ్చారు?"

"ఇంకెవరిస్తారు?"

"ఆమేనా?"

అవునన్నట్లు తలూపాడు మళ్ళీ.

"పాపం సమయానికి ఆదుకొంటోంది, ఆమె ఋణాన్ని ఎట్లా తీర్చుకుంటామో గానీ!" తనలో తను అనుకుంటున్నట్లుగా అన్న దామె.

నిజమే. హరిని హాస్పిటల్లో చేర్పించాల్సి వచ్చినప్పుడు తన చేతిలో చిల్లిగవ్వ లేకపోయింది. వచ్చిన జీతాన్ని సరిపెట్టుకోవ టమే గాని మిగుల్చుకోవటం చాతగాని తనకు సహాయ మందివ్వటానికి స్నేహితు డనబడే వా డెవడూ ముందుకు రాలేదు. అంతకు మునుపే ఇట్లాంటి అకస్మాత్ ఖర్చులకుగాను చేసిన చేబదుళ్ళను తను ఇంకా తీరవక పోవటం కూడా ఒక కారణం కావచ్చు. బంధువు లనబడే వాళ్ళను తను ఏనాడో వదిలేసుకున్నాడు—ఆస్తికీ హోదాలకీ వాళ్ళిచ్చే ఫాల్స్ విలువల్ని భరించలేక. అట్లాంటి తనకు ఇంక దిక్కెవ్వరు? అట్లా దిక్కులు చూస్తున్న సమయాన జానకే సలహా ఇచ్చింది.

"పోనీ నీ సుహాసినిని అడగండి!"

ఉలిక్కిపడ్డాడు తాను.

సుహాసినినా? ఏ మొహం పెట్టుకుని?

అదే అన్నాడు జానకితో.

"ఇప్పుడవన్నీ చూసుకుంటే ఎట్లాగండీ, బాబు గాడికోసమన్నా ..."

తానింక ఏమీ యోచించలేదు. హరికోసం ఏమైనా చేయాలి, తప్పదు. బయల్దేరాడు—

సుహాసినీ! సుహాసినీ!!

సుహాసిని ముందు నిలబడ్డాడు తాను పరవశంతో, సిగ్గుతో, కించబాటుతో, అవమానభారంతో ...

చాలా సంతోషంగా ఆహ్వానించిం దామె.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు?" ఆనందంగా అన్నది.

తనే మాట్లాడలేక పోయాడు.

"ఇన్నాళ్ళకు గుర్తొచ్చా నన్న మాట?" అన్న దామె మళ్ళీ.

"పనిమీద వచ్చాను" కుంచించుకుపోతూ అన్నాడు తను.

"ఏమిటది?"

హరి సంగతి చెప్పాడు. చాలా సానుభూతితో విన్న దామె. డబ్బులు కావాలన్న సంగతిని ఆ తర్వాత ఎలా చెప్పాలో అర్థం కాలేదు తనకు. చాలాసేపు మౌనం వహించాడు. ఆమె కూడా అదే మౌనాన్ని పాటించింది. మధ్య మధ్యలో అనేకసార్లు చెప్పటానికని తను గొంతు సవరించుకున్నాడు. కాని చెప్పలేక పోయాడు. అట్లాంటి సమయాల్లో ఆమె తలెత్తి చూసే తనవేపు. ఆఖరికి అర్థం చేసుకుందేమో, అడిగింది:

"డబ్బులు కావాలా, రఘూ?"

సమాధానం చెప్పలేకపోయాడు తను. తలను నేలకేసి కొట్టుకోవాలనిపించింది.

"ఎంత?" మళ్ళీ ఆమే అడిగింది.

"ఒక అయిదువందల రూపాయలన్నా..." నీరసంగా మూలిగాడు.

లోపలికి వెళ్ళి తెచ్చిచ్చిందామె.

ఆ అయిదు వందలూ హాస్పిటల్ ఖర్చులకు గాను తన కెన్నాళ్ళో రాలేదు. మళ్ళీ అవసరం! హరి ఇంకా హాస్పిటల్లోనే ఉన్నాడు ఈ సారి మళ్ళీ సుహాసిని వద్దకు వెళ్ళకుండా ఉండాలని ఎంతగానో ప్రయత్నించాడు. అడగకూడని వాళ్ళను కూడా అడిగాడు. మొహమాటాన్ని ఫణంగా పెట్టి చూశాడు. కాని లాభం లేకపోయింది. తిరిగి సుహాసిని ముందు నిలబడాల్సి వచ్చింది. ఈ సారి ముందుగా ఆమే ప్రస్తావించింది.

"నా వద్ద కించబడతా వెందుకు రఘూ! నీకు సహాయపడటం కంటే సంతోషకరమైన విషయం మరేముంటుంది నాకు?"

మరో అయిదు వందల్ని తీసుకువచ్చి నాకు అందించిందామె.

"మూడు వందలు చాలు సుహాసినీ ..." రెండు కాగితాల్ని ఆమెకు వాపసు ఇవ్వబోయాడు.

"ఇట్లాంటప్పుడు మొహమాటాలు వద్దు రఘూ ఉంచు ..."

అవసరాలు తన అభిమానాన్ని చంపేశాయి. మాట్లాడకుండా ఆ మొత్తాన్నీ జేబులో ఉంచుకున్నాడు. గుమ్మం వద్దకు వచ్చాకమాత్రం అన్నాడు.

**చిగురింత**

**నరికిన కొమ్మ తిరిగి**
**చెమ్మకు చిగురిస్తుంది**
**పంజరంలో బంధించిన**
**పక్షులు వీలుచూసి ఎగిరి**
**పోతాయి**

**- ఎల్లోరా**

"వీలైనంత త్వరలో తీర్చటానికి ప్రయత్నిస్తాను సుహాసినీ ..."

"వీటిని నీకు అప్పుక్రింద ఇవ్వటం లేదు రఘూ"

"అట్లా అయితే నా కొద్దు" అంటూ జేబులో చెయ్యి పెట్టాడు. కాని నిజంగా ఇచ్చేయ గలడా?

సుహాసిని వచ్చి తన భుజం తట్టింది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు!

"పిచ్చి రఘూ! పరిస్థితులకు బానిసలం మనం."

ఆమె ముందు ఎంతో అల్ప వ్యక్తిత్వాన్ని ఫీలయ్యాడు ఆ క్షణాన.

వచ్చేస్తుంటే తనకు చాలా విచిత్రమనిపించింది. అసలు తను తనేనా అనిపించింది. ఒకళ్ళను లెక్క చెయ్యని తను, ఒకళ్ళకు తలవంచని తను, ఒకప్పుడు చీదరించుకున్న సుహాసినినే దేహీ అని దేబిరించాడు, తనలో ఉన్నా యనుకుంటూ గర్వించిన వ్యక్తిత్వమూ ఔన్నత్యమూ ఏమయ్యాయి ఇవాళ? అవసరాలు తినేశాయా వాటిని? అంతలోనే గతంలోని సుహాసిని స్నేహం గుర్తొచ్చింది.

వివాహానికి పూర్వమే తమిద్దరికీ స్నేహం— మొదట ఆమెకు పెళ్ళయింది— ఆమె భర్తతోటి స్నేహం కలిసింది. వాళ్ళ ఇంటికి తను వెళ్తున్నాడు. ఆమె భర్త ఉన్నా లేకపోయినా— అదో బంధుత్వంలా అదో ఆకర్షణలో— అదో చాపల్యంతో — పైకి సంగనాచి కబుర్లు — నాజూకు వంచన— పరస్పరం గానూ, ఆత్మగతంగానూ నాగరికత నేర్పిన కృత్రిమత్వం—

తర్వాత ఏమయ్యింది?

తనకూ వివాహం— జానకి ప్రవేశం. కొత్త జీవితం. సుహాసినిని కలవటం తగ్గించాడు. క్రమక్రమంగా ఆ స్నేహానికి తెర జారుతుందేమోననిపించేంత అరుదుకి — ఒకసారి అడిగిందామె!

"ఎందుకని రావటం తగ్గించేశావు?"

"సంసారంలో పడ్డాను కదా!"

"అయితే మట్టుకు పాత స్నేహాన్ని వదిలేయ దల్చుకున్నావా?"

"అదేమీ కాదు, తీరిక ఉండాలి కదా?" ఒక వెధవ నవ్వు నవ్వాడు.

"చాలా మారిపోయావు రఘూ!"

ఆమె కళ్ళముట్టా చిప్పిల్లిన నీళ్ళు. తనలో నిండిన సంతృప్తి.

ఆ తర్వాత మరింత మానేశాడు ఆమె వద్దకు వెళ్ళటం.

అంతలో ఏదో జరిగింది, ఒక వింత వార్త విన్నాడు తను. సుహాసిని సూర్యంతో కులుకుతోందని భర్త లేని సమయాలల్లో సూర్యం ఆమె ఇంట్లోనే ఉంటున్నాడని! ఊరంతా గోల గోల...

చాలా కోపమొచ్చింది తనకు. వెళ్ళి అడిగా డామెను.

"ఇదేమీ బాగాలేదు సుహాసినీ!"

"ఏమిటి బాగోనిది?"

"ఊరంతా అనుకోవటం — సూర్యానికీ, నీకూ మధ్య ..."

"నువ్వు నమ్ముతున్నావా రఘూ?"

"నా నమ్మకం కాదు ముఖ్యం, లోకానికి నువ్వు అవకాశం ఇవ్వటం —"

"లోకాన్ని నేను లెక్క చెయ్యను. కానీ నా మాట చెప్పు రఘూ! నువ్వుకూడా అట్లాగే అనుకుంటున్నావా?"

సిగ్గుపడ్డాడు తను.

"నన్ను క్షమించు సుహాసినీ!"

ఆమె తనను ఫూల్ చేసిందన్నది త్వరలోనే తెలిసింది. ఒకసారి సినిమాహాలులో తన ముందు సీట్లో సూర్యం, సుహాసినులు కనిపించారు. పక్కన ఆమె భర్త లేడు. సూర్యంచేయి ఆమె భుజం మీద ఉంది. మధ్య మధ్య నవ్వుతోం దామె. ఒకటిరెండు సార్లు అత నామెను ముద్దుపెట్టుకోవటం కూడా కనిపించింది.

మర్నాడే వెళ్ళి కలిశా డామెను. తను చూసిన దృశ్యం గురించి అడిగాడు. ఈ సారి ఆమె పెద్దగా డిఫెండ్ చేసుకోలేదు. క్షణం మౌనం వహించి, అన్నది.

"నువ్వు చూసిందీ, లోకమనుకున్నదీ నిజమే రఘూ!"

దిమ్మ దిరిగి పోయింది తనకు.

"సుహాసినీ!" అన్నాడు.

ఆమె కాదంటుందేమో, తను చూసింది అబద్ధమని ఆమె రుజువు చేస్తుందేమో అనుకుంటూ వచ్చా డసలు. లోపల్లోపల అలా కోరుకుంటూ కూడా. కాని ఆమె చెప్పిన పచ్చి వాస్తవాన్ని అంతసడన్‌గా మింగలేకపోయాడు.

"ఇంత నీచానికి పాల్పడతావని అనుకోలేదు సుహాసినీ!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"నిన్ను నా స్నేహితురాలిగానే కాదు, నాకు తెలిసిన మనిషిగా చెప్పుకోవటానికి కూడా సిగ్గేస్తోంది సుహాసినీ. ఛీ, నువ్వంటేనే నాకు అసహ్యమేస్తోంది.'

"నా భర్తకు లేని అసహ్యం నీ కెందుకు రఘూ?" నెమ్మదిగా అన్నదామె.

"నీ భర్తకు తెలిసి ఉంటే కదా?"

"ఆయనకు తెలుసు. ఆయనకు ఇష్టమే కూడా."

అదిరిపోయాడు.

"ఏమిటి సుహాసినీ, ఏమిటి నువ్వు మాట్లాడు తోంది? అబద్ధాలు కూడా నేర్చుకున్నా వన్నమాట?"

"అబద్ధం కాదు రఘూ, ఇది పచ్చినిజం!"

కాళ్ళక్రింద భూమి విచ్చిపోతున్నట్లుగా ఫీల్

ఉచితము ఉచితము ఉచితము

తెల్లమచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే తెల్ల మచ్చల రంగు శీఘ్రంగా మార నారంభి స్తుంది. ఒకసారి యత్నించి చూడండి. ఒక ప్యాకెట్ ఉచితము. ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయండి.

MRITUNJAYA
AUSHDHALAYA (AW)
P.O. Katri Sarai (Gaya)

HIGH STANDARED BOOKS
Choice of Millions
డ్రైవింగ్ & కట్టింగ్ గైడు రూ.30/-
రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడు 35/-
300 కుటీర పరిశ్రమల గైడు30/-
సెక్స్ అట్లాస్ (యు.ఎస్.ఏ ప్రచురణ)-15/పడక గదిలో 68 రంగుల ఫొటోలు 15/-పురుషుడు స్త్రీని వశపరచుకునే-విధానం15/- కామ సూత్రాలు—(వాత్స్యాయన)15/- కోక శాస్త్రం —(112 బొమ్మలతో)15/-144 రహస్య-కెమెరా ఫొటో అల్బమ్ 30/-
POSTAGE Rs. 4/-Extra
RAJKAMAL PRAKASHAN
(AP) Aligarh-35

BURNER PROGRESS BURNER PROGRESS BURNER

ప్రోగ్రెస్®
బర్నర్

సంవత్సరాల తరబడి బాగా వెలిగే హామీ ఉన్న

భారతదేశపు మొట్టమొదటి పేరెన్నిక-గన్న బర్నర్



ఇంటర్నేషనల్ బర్నర్
మేన్యుఫేక్చరింగ్ కంపెనీ.,
పోస్ట్ బ్యాగ్ నం. 17610, బొంబాయి-400 054

PROGRESS BURNER PROGRESS BURNER PROGRESS

అయిపోయాడు కాసేపు.

"అదే నిజమైతే సుహాసినీ" గొంతు తడబడు తుండగా అన్నాడు. "నిన్నే కాదు, నీ మొగుణ్ణి కూడా అసహ్యించుకుంటున్నాను. నా హృదయమంతటి తోనూ ఐ హేట్ యూ, ఐ హేట్ యూ బోత్" అంటూ లేచి వచ్చేశాడు.

అట్లాంటి తను, ఇవాళ ఆమె వద్దకే వెళ్ళి దేబిరించాడు. ఒకసారికాదు, రెండు సార్లు! అవసరాలు వెంటతరుమగా.

రెండు సార్లూ ఆమె ఔదార్యాన్ని ప్రదర్శించింది.

తను ఓడిపోయాడు.

"ఇంతకంటే అల్పత్వం మరొకటి లేదు" విన్నగా గొణుక్కున్నాడు.

సుహాసిని భర్త సంగతే అతని కెంతకూ అంతు పట్టటం లేదు. భార్య పరాయి మగాడితో కులుకు తూంటే మౌనంగా ఆమోద ముద్ర వేసే మగవాడు అతనేనా లేక మరింకెవళ్ళన్నా ఉన్నారా ఈ లోకంలో? అది అతని బలహీనత లోకి వస్తుందా, హృదయ వైశాల్యం కిందికా? నైతిక పట్టింపు లనేవి నాగరికత పరిణామ క్రమంలో ఏర్పడ్డ రకరకాల స్టేజీలు. ఇవాళ సంధియుగం. అందుకే కొందరు పూర్తి నైతిక పట్టింపులకి అంకితమై సంఘర్షించుతుంటే మరి కొందరు పూర్తి స్వేచ్ఛా ప్రవృత్తులతో సుఖ పడుతున్నారు. అది వాళ్ళ వాళ్ళ మనస్సులు ఫిక్స్ అయి ఉన్న స్టేజెస్ మీద ఆధారపడి ఉంటోంది. ఒకడిది తన భార్య మరో మగాడితో మాట్లాడితేనే భరించలేని స్టేజీ అయితే ఇంకొకడిది తన భార్య పరాయి మగవాడి పక్కనే కూర్చుని నవ్వుతూ తుళ్ళుతున్నా భరించ గలిగే స్టేజీ. అట్లాగే మరొకడు తన భార్య పరపురుషుడి ఒళ్ళో కూర్చుని ఉండగా చూసినాకూడా నవ్వుతూ తల వూపగలిగే స్టేజీ. ఒకడు కాలానికి వెనక ఉంటే ఇంకొకడు కాలంతో పరుగు తీస్తున్నాడు. మరొకడు కాలానికి ముందునడుస్తున్నాడు. కేవలం కాలానికి సంబంధించిన మానసిక ఫిక్సేషన్స్ మాత్రమే ఇవి. ఏ మనిషి తన ప్రవృత్తికో, ప్రవర్తనకో తనకు తానుగా బాధ్యుడు కాదు. అంతకు ముందు జీవితపు అనుభ వాలూ అనుభూతులూ అతడి ఆలోచనల్నీ నిర్ణ యాన్నీ గైడ్ చేస్తుంటే కాలమూ, పరిస్థి తులూ జీవితాన్ని ముందుకు నెడుతుంటాయి. ఉదాహరణకు చిన్నప్పట్నించీ తండ్రి ప్రభావంలో పెరిగిన మానవుడికి నైతికపరమైన పట్టింపులు ఎక్కువయితే తల్లి ప్రభావంలో పెరిగిన మానవునికి నైతికపరంగా సడలింపులు ఎక్కువ. సుహాసిని భర్త ఈ రెండో బాపతుకు చెందిన వాడై ఉండాలి. లేకపోతే సెక్సు పెర్వర్షనూ కావచ్చు.

ఆలోచనలతో తల పగిలి పోతుందేమోననిపించింది. రాఘవకు. పక్కకుతిరిగి మోకాటి దండ వేసి పడు కున్నాడు. మోకాలికి మూతి తగిలేట్లుగా ముడుచుకుని మరింత ముందుకు ముడుచుకోవ టానికి ప్రయత్నిస్తూ గుండ్రంగా, ఇంకా గుండ్రానికి తల్లి గర్భంలో ఉన్నప్పటి స్థితికి చేరుకోవాలన్నట్లుగా.

ఆ స్థితిలో అతనికి చాలా సుఖకరంగా అనిపించింది. ఏవేవో ఆనంద దాయకమైన దృశ్యాలూ, ఆలోచ నలూ కదల సాగాయుతనిలో, సడన్‌గా ఒక సంఘటన ఒక గుర్తుకు వచ్చింది.

"ఈయనకు నువ్వంటే ఎంత ప్రేమో తెలుసా రఘూ?" అన్నది సుహాసిని ఒకసారి.

"ఎంత ప్రేమేమిటి?" అన్నాడు తను.

"నా విషయంగా నువ్వీయనకు ఏదైనా ద్రోహం తలపెట్టినా కూడా ఈయన దాన్ని ఆనందంగా సహించగలడు. అంత ప్రేమ!!"

ఆ సమయాన ఆమె కళ్ళు తళ తళా మెరిశాయి. తృప్తి పడ్డట్లుగా చట్టున లేచి కూర్చున్నాడు రాఘవ. అంటే—అంటే ...

ఇప్పుడు సూర్యం ఉన్న స్థానంలోకి తనను రమ్మన మని అప్పుడామె ఆహ్వానించిందా?

ఇతనట్లా సడన్‌గా ఉలికిపడటాన్ని చూసిన జానకి బెదిరిపోతూ వచ్చి అతని మంచంమీద పక్కనే కూర్చుని భుజంమీద చెయ్యేసింది.

"ఏమిటండీ, ఏమిటి?" అడిగింది ఆదుర్దాగా.

పరధ్యానంగా ఆమె వేపు చూశాడు రాఘవ. శిక్షణ పొందిన మనస్సు మాత్రం యాంత్రికంగా తన పనిని చేసుకుపోసాగింది ... బాబుగాడి రోగము, తన వేదన, సుహాసిని తప్పొప్పులు, ఆమె భర్త బల హీనత, సూర్యం అవకాశ వాదము, తన ఉక్రో షము, ఈ బాపతు సంఘర్షణ, ఇదంతా ఏమిటి? కొంతకాలమయాక, అనుభవాల నీడలో కూర్చుని, వివేకపు వెలుగులోంచి వీక్షిస్తే జీవితంలో తటస్థిం చిన బలహీనమైన ఈ అనుబంధాలు, అనురాగాలు, నైతిక బంధనాలు, కట్టుబాట్లు, వాటిని తెంచుకోవటాలు, పశ్చాత్తాపాలు, కోప తాపాలు, ఇవన్నీ పిల్లలాడుకునే ఆటల్లా, ఓ వెర్రి వాడి క్రీడల్లా కనిపిస్తాయి గావును. వాస్తవానికి మనమనుకుంటున్నట్లుగా మనకు మనం స్వతం త్రులము కాము, అంత ప్రాధాన్యతగల జీవులమూ కాము. కేవలం సృష్టి క్రీడకు అవసరమవుతున్న సృష్టి సృష్టించుకున్న పనిముట్లము...

"ఏమిటండీ, అట్లా చూస్తున్నారేమిటి?" అతన్ని పట్టి కుదుపుతూ ఆందోళనగా అడిగింది భార్య.

అనుతున్నట్లుగా అంత దగ్గరలో ఉన్న ఆమె శరీరం అయస్కాంతంలా అతడి అవయవాల్లోని రక్తాన్ని ఆకర్షించుతూ అతడి మనస్సును డైవర్ట్ చేయసాగింది.

ఎన్నాళ్ళయింది తామిద్దరూ కలిసి??

మళ్ళీ అంతలోనే మనస్సులో సంచలనం, ఆలో చనల కలగాపులగం ... ఉండటమూ, లేకపోవ టమూ—బీయింగ్ అండ్ నథింగ్‌నెస్—

శరీరం చుట్టలు విప్పుకోసాగింది. ఆమె చుట్టూ చేతులు వేశాడు. "ఇదేమిటండీ ఇదేమిటి? అవతల బాబు..." అతని పెదవుల క్రింద ఆమె మాటలు అణిగిపోయాయి. "బాబండీ, బాబు", గొణుగుతోం దామె.

భౌతికంగానూ, మానసికంగానూ అతనిలోంచి ఉప్పొంగుతున్న చైతన్యమూ, ఉత్తేజమూ క్రమంగా ఆమెను అణగదీయసాగాయి. పరిపూర్ణతను సిద్ధింపు కుంటూ సృష్టి ముందుకు కదలసాగింది... *